క్లుప్తంగా

ఆమనగల్లు గౌడసంఘం నూతన కమిటీ ఎన్నిక



నూతన సభ్యులను సన్మానిస్తున్న గౌడసంఘం నేతలు

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ గౌడ సంఘం అధ్యక్షుడిగా గజ్జె వెంకటయ్యగౌడ్‌ను ఎన్నుకున్నారు. ఆమనగల్లు పట్టణంలోని భవానీ గార్డెన్స్‌లో గురువారం ఆమనగల్లు మున్సిపాలిటీ గౌడసంఘం సమావేశం నిర్వహించారు. సమావేశంలో శ్రీ కంఠమహేశ్వర ఆలయ చైర్మన్ చుక్క అల్లాజీగౌడ్, కార్యదర్శి గంగా రవీందర్‌గౌడ్, నాయకులు నారాయణ, యాదయ్య, నిరంజన్‌గౌడ్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ గౌడ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గజ్జె వెంకటయ్యగౌడ్, ప్రధాన కార్యదర్శిగా గోదా సతీష్‌గౌడ్, కోశాధికారిగా నర్సింహగౌడ్, ఉపాధ్యక్షులుగా రాజుగౌడ్, జంగయ్యగౌడ్, భిక్షపతి, అల్లాజీ, నర్సింహ, వెంకటయ్య, సంయుక్త కార్యదర్శులుగా శ్రీనుగౌడ్, హరినాద్‌గౌడ్, యాదయ్యగౌడ్, కుమార్‌గౌడ్, సురేశ్, శివ, కృష్ణయ్య, పలువురిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను గౌడసంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.

గట్టుఇప్పలపల్లి సర్పంచ్ రాజీనామా



ఎంపీడీఓకు రాజీనామా పత్రం అందజేస్తున్న సర్పంచ్ జయమ్మ

తలకొండపల్లి: గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని ఆ గ్రామ సర్పంచ్ జోలం జయమ్మ రాజీనామా చేశారు. ఈ మేరకు గురువారం ఎంపీడీఓ శ్రీకాంత్‌కు రాజీనామాపత్రాన్ని అందజేశారు. జేఏసీ ఆధ్వర్యంలో గత 25 రోజుల నుంచి నిరాహార దీక్షలు చేపడుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీకాంత్, ఎంపీఓ రఘు, కార్యదర్శి బాలరాజ్, బీఆర్‌ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గొరెల్లి రోడ్డుపై బారికేడ్ల ఏర్పాటు




బారికేడ్లు ఏర్పాటు చేస్తున్న రాంరెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: గొరెల్లి కూడలి వద్ద ఉన్న రేడియల్ రోడ్డుపై నిత్యం వాహనాలు ప్రమాదాలకు గురికావడంతో పాటు పలువురు మృత్యువాత పడుతున్నారన్న విషయం తెలుసుకున్న పీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రాంరెడ్డి సొంతంగా రూ.లక్షతో బారికేడ్లు ఏర్పాటు చేశారు. గురువారం గొరెల్లి కూడలి వద్ద ఆయన బారికేడ్లను ఏర్పాటు చేశారు.

శాంతిభద్రతలకు సహకరించాలి

ఇబ్రహీంపట్నం ఏసీపీ శ్రీనివాసరావు



ఇబ్రహీంపట్నం రూరల్: శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే ఎవ్వరినీ ఉపేక్షించేది లేదని ఇబ్రహీంపట్నం ఏసీపీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం ఏసీపీగా పనిచేసిన ఉమమహేశ్వరరావు రెండు రోజుల క్రితం సీసీఎస్‌కు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో ఇంటెలిజెన్స్ విభాగంలో పనిచేస్తున్న శ్రీనివాసరావు ఇబ్రహీంపట్నం నూతన ఏసీపీగా బదిలీపై వచ్చారు. గురువారం నూతన ఏసీపీ శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు. డివిజనలోని సీఐ, ఎస్‌ఐలు కలిసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏసీపీ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. శాంతిభద్రతలను కాపాడటంలో పోలీసుల పాత్ర కీలకమన్నారు. పోలీసులకు ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు.

కంట్రోల్ రూం ఏర్పాటు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలో భారీ వర్షాలు కురుస్తుండటంతో కంట్రోల్ రూంను ఏర్పాటు చేసినట్లు కమిషనర్ రవీంద్రసాగర్ తెలిపారు. 24/7 ప్రత్యేక కంట్రోల్‌రూం ప్రజలకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. అత్యవసరమున్న, ఆపదలో చిక్కుకున్న ప్రజలు డిజాస్టర్ రెస్పాన్సిబిలిటీ టీం ఫోన్ నంబర్లు 76758 29268, 98665 26152కు కాల్ చేసి సమాచారాన్ని ఇవ్వాలని కోరారు. ప్రమాదకర ప్రాంతాల్లో మున్సిపల్ సిబ్బందిని మోహరించినట్లు తెలిపారు. శిథిలావస్థ ఇండ్లల్లోని వారు సురక్షిత ప్రదేశాలకు వెళ్లాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నూతన భవనానికి గ్రహణం

- శిథిలావస్థలో యాచారం సీహెచ్‌సీ
- పెచ్చులూడుతున్న భవనం పైకప్పు
- భయాందోళనలో సిబ్బంది, రోగులు
- నిధులు మంజూరైనా ప్రారంభానికి నోచుకోని భవన నిర్మాణ పనులు



యాచారం సామాజిక ఆరోగ్య కేంద్రం, (ఇన్‌సెట్‌లో) పెచ్చులూడిన పైకప్పు

యాచారం: సాగర్ హైవేపై యాచారం మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ) పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. గతంలో ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంగా ఉన్న ఈ ఆస్పత్రిని ఏడాది కింద అప్‌గ్రేడ్ చేసి సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ)గా మార్చారు. ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేయడం వరకు బాగానే ఉన్నా ఏళ్ల కింద నిర్మించిన భవనాన్ని కూల్చేసి నూతన భవనం నిర్మించే విషయంలో అధికారులకు, ప్రజాప్రతినిధులకు చిత్తశుద్ధి లేకుండా పోతుంది. తెలంగాణ రాష్ట్ర వైద్యవిధాన పరిషత్ కింద సేవలు అందించే ఈ ఆస్పత్రిలో నేటికీ పూర్తిస్థాయి వైద్య సిబ్బందిని నియమించలేదు. యాచారం ఆస్పత్రి అంటే మెరుగైన వైద్య సేవలు అందుతాయనే భరోసా ప్రజల్లో నెలకొంది. ఆ భరోసాతోనే యాచారం మండల ప్రజలే కాకుండా కందుకూరు, మాడ్గుల్, కడ్తాల్, ఆమనగల్లు, మంచాల, ఇబ్రహీంపట్నం మండలాల ప్రజలతో పాటు నల్లగొండ జిల్లా చింతపల్లి, మర్రిగూడ మండలాల నుంచి నిత్యం రోగులు వస్తారు. ఇంత ప్రజాదరణ కలిగిన ఈ ఆస్పత్రిని అభివృద్ధి చేసి.. సౌకర్యాలు కల్పించే విషయంలో సర్కార్ ఏ మాత్రం దృష్టి సారించడం లేదని విమర్శలు ఉన్నాయి. పలు గ్రామాల నుంచి ప్రస్తుతం ఈ ఆస్పత్రికి నిత్యం 200 మందికి పైగానే రోగులు వస్తారు. వైద్యులు సరైన సమయానికి రాకపోయినప్పటికీ వచ్చే వరకు ఉండి వైద్య సేవలు పొందుతారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు సీజనల్ వ్యాధుల బారినపడి పెద్ద సంఖ్యలో రోగులు ఆస్పత్రికి వస్తున్నారు.

పగుళ్లతో భయాందోళన..

ఏళ్ల కింద నిర్మించిన ఈ ఆస్పత్రి భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ఆస్పత్రిలోని ప్రతి గది పై కప్పు పెచ్చులూడి పోతోంది. భవనం పైన నిలిచిన వర్షపు నీరు మొత్తం పగుళ్ల ద్వారా కిందకు వస్తుంది. ఆస్పత్రిలో రోగులను పరీక్షించే గది, వైద్య సిబ్బంది రోగులకు మందులు, ఇంజక్షన్లు ఇచ్చే గది, కంప్యూటర్ గది, మహిళలకు డెలివరీ జరిపే గది, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించుకున్న వారు విశ్రాంతి తీసుకునే గదుల్లో పూర్తిగా నీళ్లు వచ్చి చేరుతున్నాయి. ఎప్పుడు ఏ గది పైకప్పు కూలుతుందోనని రోగులు, సిబ్బంది భయాందోళన చెందుతున్నారు. రెండు రోజుల కింద పైపెచ్చులు కిందపడగా అదృష్టవశాత్తు ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడం, ఆవరణ అంతా చెట్లు, పరిశుభ్రంగా లేకపోవడంతో విషసర్పాలు ఆస్పత్రిలోకి వస్తున్నాయి. వారం, పది రోజుల వ్యవధిలోనే మూడు విషసర్పాలను సిబ్బంది చంపేశారు.

రూ.కోటిన్నర నిధులు మంజూరైనా..

యాచారం సామాజిక ఆరోగ్య కేంద్రం శాశ్వత భవన నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి జిల్లా మినరల్ ఫండ్ కింద రూ.కోటిన్నర నిధులు మంజూరు చేయించారు. నిధులు మంజూరు కావడంతో అధికారులు వచ్చి ఆస్పత్రి భవనం ఏ ప్రాంతంలో నిర్మిస్తే బాగుంటుందనే వివరాలను సేకరించారు. నూతన భవన నిర్మాణం కోసం కొలతలు కూడా తీసుకున్నారు. అయితే నెలలు గడుస్తున్నా ఆస్పత్రి నూతన భవన నిర్మాణ పనులు ప్రారంభానికి నోచుకోవడంలేదు. కొద్ది నెలల కింద రాష్ట్ర వైద్య, విధాన పరిషత్ ఉన్నతాధికారులు ఆస్పత్రిని సందర్శించారు. త్వరలో పూర్తిస్థాయిలో వైద్య సిబ్బందిని, నూతన ఆస్పత్రి భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసే అవకాశం ఉంటుందని తెలియజేశారు. అయినప్పటికీ పనుల్లో పురోగతి కనిపించడం లేదు.

ఎప్పుడు కూలుతుందో తెలియదు



యాచారం సామాజిక ఆరోగ్య కేంద్రంలో పూర్తి స్థాయిలో వైద్య సిబ్బంది లేకపోవడంతో గునుగల్, గడ్డమల్లయ్యగూడ గ్రామాల నుంచి రోగులు ఇబ్రహీంపట్నంలోని ప్రైవేట్ ఆస్పత్రులకే వెళ్తున్నారు. పూర్తి స్థాయిలో వైద్యులను నియమించాలని పలుమార్లు సమావేశాల్లో అధికారులను కోరినా ఫలితం లేదు. ఆస్పత్రి మొత్తం పగుళ్లు ఏర్పడి ఎప్పుడు కూలుతుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

– జంగయ్య, సర్పంచ్, గడ్డమల్లయ్యగూడ

నిధులు మంజూరయ్యాయి



యాచారం సామాజిక ఆరోగ్య కేంద్రం శాశ్వత భవన నిర్మాణానికి జిల్లా మినరల్ ఫండ్ కింద ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి రూ.కోటిన్నర నిధులు మంజూరు చేయించారు. భవనం ఎక్కడ నిర్మించాలో మ్యాప్ కూడా తయారు చేశాం. రాష్ట్ర వైద్యవిధాన పరిషత్ ఉన్నతాధికారులు వచ్చి పరిశీలించారు. ఎప్పుడు పనులు ప్రారంభించాలన్నది ఉన్నతాధికారుల చేతుల్లో ఉంది.

– ఉస్మాన్ పఠాన్, ఏఈఈ, పంచాయతీ రాజ్, యాచారం

వెంటనే పనులు ప్రారంభించాలి



ఆస్పత్రి అప్‌గ్రేడ్ కావడమే కాని వైద్య సిబ్బంది పూర్తి స్థాయిలో నియమితులు కాలేదు. వర్షాలు కురిస్తే ఆస్పత్రికి రావాలంటే రోగులు, సేవలు అందించాలంటే వైద్యులు భయాందోళన చెందుతారు. మంజూరైన నిధులతో సీహెచ్‌సీ నూతన భవన నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలి.

– కొప్పు సుకన్య, ఎంపీపీ యాచారం

కొనసాగుతున్న నిరాహార దీక్షలు

తలకొండపల్లి: గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించేంతవరకు ఆందోళన కొనసాగిస్తామని వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జేఏసీ ఆధ్వర్యంలో వివిధ పార్టీల నాయకులు చేపట్టిన రిలే నిరహార దీక్షలు గురువారానికి 25వ రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరాన్ని శ్రీనివాసురెడ్డి సందర్శించి మద్దతు తెలిపారు. మాజీ సర్పంచ్ జంగమ్మ, మైసయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు దామోదర్, డేవిడ్, నాయకులు పవన్ వాల్మీకి, పాండు, ఏకోప, లక్ష్మణరావు, ఎల్లేశ, వెంకటయ్య, దాసు, రాములు, చంద్రయ్య, నర్సింహ, పెద్దయ్య, యాదయ్య, రేణురెడ్డి పాల్గొన్నారు.

మండల సర్వేయర్‌గా వెంకటేశ్

తలకొండపల్లి: తలకొండపల్లి మండల సర్వేయర్‌గా వెంకటేశ్ నియమితులయ్యారని డిప్యూటీ తహసీల్దార్ సంతోష్ గురువారం తెలిపారు. ఇప్పటివరకు ఇతను జిల్లా ఏడీ, సర్వే అండ్ రికార్డ్స్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నాడు. ఇన్‌చార్జి సర్వేయర్‌గా ప్రతినెలా 15రోజుల పాటు మండలంలో పనిచేయనున్నారని డిప్యూటీ తహసీల్దార్ చెప్పారు.

ఆర్థికసాయం అందజేత

తలకొండపల్లి: మండల పరిధిలోని చుక్కాపూర్‌కు చెందిన అంజయ్య (63) అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. సర్పంచ్ కిష్టమ్మ, మాజీ ఎంపీటీసీ యాదయ్య మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ అందజేసిన రూ.3000, వ్యక్తిగతంగా సర్పంచ్ రూ.1000 అందజేశారు. కార్యక్రమంలో కృష్ణ, రామచంద్రయ్య, పర్వతాలు, కిష్టమ్మ, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్ తరాలకు మార్గదర్శకుడు కలాం

జెడ్పీటీసీ దశరథ్‌నాయక్



కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కడ్తాల్: భవిష్యత్ తరాలకు మార్గదర్శకుడిగా, యువతకు స్ఫూర్తి ప్రదాతగా భారతరత్న, దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం నిలిచారని జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్‌గుప్తా అన్నారు. అబ్దుల్ కలాం వర్థంతిని పురస్కరించుకుని గురువారం కడ్తాల్ మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి ప్రజాప్రతినిధులు, నాయకులు నివాళులర్పించారు. ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆనంద్, రైతుబంధు మండల అధ్యక్షుడు వీరయ్య, సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహారెడ్డి, హరిచంద్, సులోచన, తులసీరాం, జంగయ్య, ఎంపీటీసీలు లచ్చిరామ్‌నాయక్, యువజన సంఘాల అధ్యక్షుడు రాఘవేందర్, ఉప సర్పంచ్ రామకృష్ణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ లాయక్‌అలీ, ఇర్షాద్, భిక్షపతి, కృష్ణ, సురేశ్, నాగార్జున్ తదితరులు ఉన్నారు.

కేంద్ర పథకాలను ప్రజలకు వివరించండి



ఇంటింటి ప్రచారంలో ఆచారి, బీజేపీ నాయకులు

బీజేపీ సీనియర్ నేత ఆచారి

కడ్తాల్: కేంద్ర ప్రభుత్వం గత తొమ్మిది సంవత్సరాలుగా ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను గడప గడపకు వెళ్లి వివరించేందుకే మహాజన సంపర్క్ అభియాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ సీనియర్ నేత ఆచారి అన్నారు. గురువారం మండల పరిధిలోని గానుగుమార్లతండా, కానుగుబావి తండా, అన్మాస్‌పల్లిలో ఆయన పర్యటించారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు తథ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు మోహన్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు మాన్యనాయక్, మాజీ ఎంపీపీ వీరయ్య, నాయకులు డాక్టర్ రమేశ్, సాయిలాల్, శంకర్‌నాయక్, రెడ్యానాయక్, లక్ష్మన్‌నాయక్, రాందాస్, భగీరథ్, శ్రీశైలం గౌడ్, వెంకటేశ్, దశరథ్, ప్రేమ్‌కుమార్, మహేశ్ సాయిప్రభు, శ్రీను, విజయ్ తదితరులు ఉన్నారు.

పోల్కంపల్లి కార్యదర్శిపై విచారణకు డీపీఓ ఆదేశం

ఇబ్రహీంపట్నం రూరల్: పోల్కంపల్లి పంచాయతీ కార్యదర్శి వ్యవహారంపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని రంగారెడ్డి జిల్లా డీపీఓ శ్రీనివాస్‌రెడ్డి ఇబ్రహీంపట్నం ఎంపీఓ లక్పతినాయక్‌కు గురువారం ఫోన్ చేసి ఆదేశించారు. ఈ సందర్భంగా ఎంపీఓ లక్పతినాయక్ మాట్లాడుతూ.. పోల్కంపల్లి పంచాయతీ వార్డు సభ్యులు 7మంది.. పంచాయతీ కార్యదర్శిపై రూ.4 లక్షల నిధుల్లో అవకతవకలు జరిపాడని ఫిర్యాదులో పేర్కొన్నారని చెప్పారు. రెండు మూడు రోజుల్లో పోల్కంపల్లి గ్రామానికి వెళ్లి పంచాయతీ రికార్డులు పరిశీలిస్తానన్నారు. ఎవరు తప్పు చేసినా వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీకి చెందిన జహంగీర్‌కు ముఖ్యమంత్రి సహాయనిధి పథకం కింద ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సహకారంతో రూ.60 వేలు, సంకటోనిపల్లి గ్రామానికి చెందిన కిష్టమ్మకు రూ.45వేలు మంజూరయ్యాయి. హైదరాబాద్‌లోని గురువారం ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఆమనగల్లు వైస్ ఎంపీపీ అనంతరెడ్డి, మాడ్గుల మాజీ ఎంపీపీ జైపాల్‌నాయక్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మస్కు నర్సింహ సేవలు ఎనలేనివి: సీపీఎం

యాచారం: మాజీ ఎమ్మెల్యే మస్కు నర్సింహ సేవలు ఎనలేనివని సీపీఎం జిల్లా నాయకుడు వినోద్‌కుమార్ పేర్కొన్నారు. చింతుల్ల గ్రామంలో గురువారం మస్కు నర్సింహ వర్థంతిని నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన చౌరాస్తాలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. భూమి కోసం, భుక్తి కోసం, పేదలకు భూముల పంపిణీలో ఎనలేని కృషి చేశారని అన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో మస్కు నర్సింహ హయాంలోనే పేదలందరికీ ఇళ్లు మంజూరయ్యాయని అన్నారు. ఆయన సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో నాయకులు బుగ్గరాములు, శ్రీనివాస్, సంజీవ, జంగయ్య, నర్సింహ, యాదగిరి, రవికుమార్, రాజు, భూషణ్ తదితరులు పాల్గొన్నారు.

స్వరాష్ట్రంలో రాయితీలన్నీ ఎత్తేశారు



సమావేశంలో మాట్లాడుతున్న చింతల రామచంద్రారెడ్డి

మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత చింతల రామచంద్రారెడ్డి

యాచారం: సీఎం కేసీఆర్ రైతుబంధు పథకం ఇచ్చి మిగితా రాయితీలు అన్నీ బంద్ చేసి రైతులను మోసం చేస్తున్నాడని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత చింతల రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం, కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో గురువారం యాచారం రైతువేదికలో ప్రధాని నరేంద్రమోదీ రాజస్థాన్ రాష్ట్రంలోని సికర్ ప్రాంతం నుంచి ఎరువుల దుకాణాలను కిసాన్ సమృద్ధి కేంద్రాలను జాతికి అంకితం చేసే ప్రసంగాన్ని విన్నారు. ప్రసంగం విన్న అనంతరం రామచంద్రారెడ్డి మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలోని బీఆర్‌ఎస్ సర్కార్ రైతులను మోసం చేయడమే లక్ష్యంగా కుట్రలు చేస్తుందని అన్నారు. ధరణి పోర్టల్ తెచ్చి రైతులను దగా చేస్తుందని అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ ప్రతియేటా మూడు దఫాలుగా రూ.రెండు వేల చొప్పున నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమచేస్తున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తేనే రైతులకు మేలు జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొప్పు సుకన్య, బీజేపీ సీనియర్ నాయకులు నర్సింహారెడ్డి, ప్రతాప్, అర్జున్‌రెడ్డి, అశోక్‌గౌడ్, దయానంద్‌గౌడ్, బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య యాదవ్, జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, బీజేపీ యాచారం మండల అధ్యక్షుడు రవీందర్, నాయకులు జంగయ్యగౌడ్, విజయకుమార్, రాజు, నరేష్, లక్ష్మణ్, హరికిషన్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

మండల పరిషత్ నిధుల వివరాలివ్వండి

- సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీల పట్టు
- వివరాలిచ్చేవరకు సభకు హాజరుకామంటూ వాకౌట్

కడ్తాల్: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం ప్రారంభమైన పదిహేను నిమిషాలకే వాయిదా పడింది. ఎంపీపీ కమ్లీమోత్యానాయక్ అధ్యక్షతన ప్రారంభమైన సమావేశానికి జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్‌గుప్తా, వైస్ ఎంపీపీ ఆనంద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సభకు మండల పరిధిలోని వివిధ శాఖల అధికారులు కూడా హాజరయ్యారు. సభ ప్రారంభం కాగానే ఎంపీటీసీ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, రాములుగౌడ్, గోపాల్, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్ బాబా.. మండల పరిషత్ నిధులకు సంబంధించి ఎంపీడీఓ పూర్తి వివరాలు అందించాలని కోరారు. మూడు సంవత్సరాలుగా మండల పరిషత్ నిధులకు సంబంధించి ఎంపీడీఓను వివరాలు అడిగితే దాటవేయడం జరుగుతుందని.. మండల పరిషత్ నిధులకు సంబంధించి సమగ్ర వివరాలు అందించే వరకు సర్వసభ్య సమావేశం నిర్వహించవద్దని డిమాండ్ చేశారు. నిధులకు సంబంధించి అనేక అవకతవకలు చోటు చేసుకున్నాయని...పూర్తి వివరాలు సభలో వెల్లడించే వరకు సమావేశాన్ని నిర్వహించేది లేదని ఎంపీటీసీ సభ్యులు సభను బైకాట్ చేసి వెళ్లిపోయారు. ఎంపీటీసీలువాకౌట్‌చేయడంతో చేసేదిలేక ఎంపీపీ కమ్లీమోత్యానాయక్ సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేశారు.



ఇబ్రహీంపట్నం: లక్ష్మీనగర్ కాలనీలోకి చేరిన పెద్ద చెరువు బ్యాక్ వాటర్



తుర్కయంజాల్: తొర్రూర్ రోడ్డులో పరిస్థితిని సమీక్షిస్తున్న చైర్‌పర్సన్ అనురాధ, అధికారులు

జలమయం

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కల్వకుర్తి, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల్లోని వాగులు, వంకలు పొంగిపొర్లాయి. చెరువులు, కుంటలు అలుగుపారాయి. లోతట్టు ప్రాంతాలు జలమయ్యాయి. పలుచోట్ల ఇళ్లు కూలిపోగా.. శిథిలావస్థలో ఉన్న ఇళ్లలోని ప్రజలను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. పలు గ్రామాల రహదారులపై వరద నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఆయా ప్రాంతాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు పర్యటించి ముంపు నివారణ చర్యలు చేపట్టారు.

– సాక్షి, నెట్‌వర్క్



తలకొండపల్లి: కూలిన ఇంటిని పరిశీలిస్తున్న సర్పంచ్ కుమార్



ఇబ్రహీంపట్నం: కాలనీలో చేరిన చిన్నచెరువు బ్యాక్ వాటర్



బాటసింగారం–మజీద్‌పూర్ మధ్య ఏర్పాటు చేసిన బారికేడ్లు



ఆమనగల్లు: వరిపొలంలో నిలిచిన వర్షపు నీరు



మంచాల: కూలిన ఇంటిని పరిశీలిస్తున్న ఎంపీపీ నర్మద, అధికారులు



ఆమనగల్లు: నిండుకుండలా సురసముద్రం చెరువు

అప్రమత్తంగా ఉండాలి

అధికారులతో ఎంపీపీ కృపేశ్ సమీక్ష

ఇబ్రహీంపట్నం: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఎంపీపీ కృపేశ్ గురువారం అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లలోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. వాగులు, నీటి కుంటలు, చెరువులు ప్రమాదస్థాయికి చేరుకుంటే హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసి ప్రజలు అటువైపు వెళ్లకుండా చూడాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య మెరుగుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. వర్షాలు తగ్గేంతవరకు అధికారులు 24 గంటల పాటు అప్రమత్తంగా ఉండాలన్నారు. మండల స్థాయిలో కంట్రోల్ రూం అందుబాటులో తీసుకురావాలన్నారు. గ్రామాల్లో వర్షాలకు సమస్యలు తలెత్తితే 94407 04174 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో మండల వైస్ ప్రెసిడెంట్ మంచిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, మండల సూపరింటెండెంట్ క్రాంతికిరణ్, మండల ఏఈ ఇంద్రసేనారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్ఐ క్రిష్టారెడ్డి, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పీర్ల ఉత్సవాలకు విరాళం

తలకొండపల్లి: పండుగలు మన సంస్కృతిని ప్రతిబింబిస్తాయని ప్రముఖ సంఘ సంస్కర్త నారెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని జూలపల్లిలో పీర్ల పండుగ నిర్వహించేందుకు గాను నారెడ్డి ప్రశాంత్‌రెడ్డి ముస్లిం సోదరులకు గురువారం రూ.10,000 విరాళం అందజేశారు. ప్రశాంతమైన వాతావరణంలో మోహర్రం జరుపుకోవాలని ప్రశాంత్‌రెడ్డి కోరారు. వెంకటేష్‌గౌడ్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.